క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల వేలం

గుంతకల్లు: రూరల్ పోలీసుసేష్టన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను స్థానిక సెబ్ పోలీసుసేష్టన్ ఆవరణలో శనివారం సెబ్ సీఐ మహేష్‌కుమార్, రూరల్ ఎస్ఐ కుమర్ సమక్షంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం 9 వాహనాలకు జీఎస్టీతో కలిసి మొత్తం రూ.1,28000 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధురాలికి దుప్పటి అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక చింతల వెంకటరమణ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు ఆలయ కమిటీ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు, యాచకులకు ఉన్ని దుప్పట్లు, తిరుమల, తిరుపతి లడ్డూలను అందజేశారు. కార్యక్రమంలో చింతల వెంకటరమణస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మురళీస్వామి, చింతల, బుగ్గ ఆలయాల కమిటీ సభ్యులు సంజన్న, భూమా హరి, లక్ష్మీదేవి, మధ్యాల లత, లక్ష్మీదేవి, భగీరథమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్

గుంతకల్లు: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం నక్కనదొడ్డి సమీపంలోని ఐఓసీ డిపోలో పట్టణ ప్రగతి మైత్రి మహిళ సంఘం ఆధ్వర్యంలో ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, క్లీనర్లకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 210 మందికి హెచ్ఐవీ టెస్టులు నిర్వహించారు. ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐఓసీ సీనియర్ మేనేజర్ దాస్‌ప్రసాద్, లైజనర్ జీఏ నజీర్, మేనేజర్ హరికృష్ణ, సెక్యూరిటీ చీఫ్ హుసేన్, ప్రగతి మహిళ సంఘం నేతలు పాల్గొన్నారు.

నేడు గుత్తి మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణం

గుత్తి: గుత్తి వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్కెట్ నూతన కమిటీ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు మార్కెట్ యార్డు అధికారులు, వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. మార్కెట్ యార్డు చైర్మన్‌గా చెవుల సునీల, వైస్ చైర్మన్‌గా రెక్కాల నాగిరెడ్డి, డైరెక్టర్లుగా రాములమ్మ, సాంబశివారెడ్డి, గోవిందు, చెన్న కేశవులు, అరుణ, రవూఫ్, పద్మావతి, ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి, మెహతాజ్, బ్రహ్మానందరెడ్డి, అమర్‌నాథ్, నాగరాజు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

యల్లనూరు: యల్లనూరు, వెన్నపూసపల్లి గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా యల్లనూరులో 30 మందికి, వెన్నపూసపల్లిలో 16 మందికి ఆధార్ తీసినట్లు సచివాలయ సిబ్బంది దాదా, భాస్కర్‌రెడ్డి తెలిపారు.

నేడు 144 సెక్షన్ అమలు

పామిడి: పోలీస్ రిక్రూట్‌మెంట్ ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఎస్ఐ షేక్ చాంద్‌బాషాతో కలిసి పరీక్ష కేంద్రాలైన మోడల్‌స్కూల్, ఎస్ఎఫ్ఎస్, సరస్వతీ ఉన్నత విద్యామందిరం, ఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

24న మార్కండేయ జయంతి

తాడిపత్రి టౌన్: స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో ఈనెల 24న మార్కండేయ స్వామి జయంతి నిర్వహిస్తున్నట్లు బహూత్తమ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వచనం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

కళ్యాణదుర్గం: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ సూచించారు. స్థానిక సబ్ జైలును శనివారం జడ్జి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్య పరిస్థితి, జైలులో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అంతకు ముందు జైలు సూపరిండెంట్ ధనుంజయ నాయుడుతో జైలులో సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు.

గడప గడపకూ పథకాలు తీసుకెళ్లండి



ఎమ్మెల్యే వైవీఆర్‌ను శాలువాతో సన్మానిస్తున్న సచివాలయాల పట్టణ, మండల కన్వీనర్లు

గుంతకల్లుటౌన్: సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహసారథుల ద్వారా ఇంటింటికీ వివరించి వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి అంకితభావంతో పనిచేయాలని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పార్టీ పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లకు సూచించారు. శనివారం ఎమ్మెల్యేను గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన పార్టీ సచివాలయాల కన్వీనర్లు కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ గృహసారథులు, వార్డు సచివాలయ కన్వీనర్లతో సమన్వయం చేసుకుని జగనన్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం ద్వారా ప్రజలను మభ్య పెట్టడానికి వార్డులు, గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వంపై బురదజల్లుతున్న టీడీపీ నేతల దుష్ప్రచారాల్ని తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ సచివాలయాల కన్వీనర్లు జింకల రామాంజనేయులు, ఎండీ.ఖలీల్, మండల కన్వీనర్ ఎస్.గోవింద్‌నాయక్, పామిడి పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు ఆసీఫ్, కుమార్‌రెడ్డిలతో పాటు పామిడి ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు సోమిరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



కోటంక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

గార్లదిన్నె: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి పేర్కొన్నారు. శనివారం కోటంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల అధికారులు పర్యటించారు. వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ప్రతి ఒక్క రూ ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

గ్రామ సచివాలయాల్లో నిర్వహించే మొబైల్ ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్ ప్రజలకు సూచించారు. శనివారం కోటంకలో మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలు ఉచితంగా పొందవచ్చునన్నారు.

పుట్లూరు: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణ సాధించాలని తహసీల్దార్ సుమతి అన్నారు. శనివారం ఆమె ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో హాజరు పట్టికను పరిశీలించి విద్యార్థులకు సూచనలు అందించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ యోగానంద రెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. అనంత సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలకు ఓ మండల స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందన్నారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న ఎంవీఐ రాజాబాబు

గుంతకల్లు: డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని గుంతకల్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ రాజాబాబు సూచించారు. శనివారం స్థానిక హౌసింగ్‌బోర్డులోని ఎంవీఐ కార్యాలయంలో రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కొన్ని నియమాలు, జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవచ్చన్నారు. వాహనదారులు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



వెంగమనాయుడు కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏసీ రామాంజనేయులు

యాడికి: కమలపాడు రహదారిలోని వెంగమనాయుడు కాలనీలో వివాదాస్పద స్థలాన్ని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, సీపీఐ నాయకులతో వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ భూములకు సంబంధించిన రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు. అయితే 2008కి ముందు క్రయవిక్రయాలు జరిగి ఉంటే వాటిని అనుభవించవచ్చని, వాటిని ఇతరులు కొనుగోలు చేసేందుకు యత్నించినా రిజిస్ట్రేషన్లు జరగవన్నారు. సదరు స్థలాన్ని సర్వే చేయాలని తహసీల్దార్‌కు సూచించినట్లు తెలిపారు. దేవదాయ శాఖ ఏఈ దుర్గా ప్రసాద్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి



మర్తాడులో హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి పేర్కొన్నారు. శనివారం మర్తాడులో అధికారులు హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఇళ్లు మంజూరైన 44 మంది లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి, ఇళ్ల నిర్మాణాలుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, హౌసింగ్ ఏఈ విజయ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తాం

అనంతపురం టవర్‌క్లాక్: బళ్లారి – పంగల్ రోడ్డులో మహనీయుల విగ్రహాలను అధికారులతో చర్చించి, త్వరలో ఏర్పాటు చేస్తామని జాతీయ రహదారులశాఖ ఈఈ మధుసూదన రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారుల కమిటీ ప్రస్తుతం ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ విగ్రహాన్ని కలెక్టరేట్ ఎదురుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మిగిలిన విగ్రహాలు అధికారుల కమిటీ నిర్ణయం ప్రకారం త్వరలోనే ఏర్పాట్లు చేస్తామన్నారు.

పెన్నహోబిలంలో పల్లకీ సేవ

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె.వి జయ్‌కుమార్, అర్చకులు ఆధ్వర్యంలో శనివారం పల్లకీ సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి, మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. అంతకుముందు భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కూడేరు: కూడేరులోని వైఎస్ విగ్రహం వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పై శనివారం రాత్రి 9 గంటలప్పుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. కూడేరుకు చెందిన ఎర్రిస్వామి రోడ్డు దాటుతుండగా రవికృప రైస్ మిల్‌లో పని చేస్తున్న అనూప్,మాధర్‌లు ద్విచక్ర వాహనంలో ఆర్టీపీ బస్టాండ్ వైపు వెళుతూ అదుపు తప్పి ఢీకొట్టారు. క్షతగాత్రులను 108లో అనంతపురంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు.

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి వద్ద శనివారం రాత్రి బైకు, కారు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో హులికల్లు గ్రామానికి చెందిన సుమిత్ర, సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సుధాకర్, అన్నకూతురు సుమిత్ర, భారతి కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామం హులికల్లుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఇదే సమయంలో కళ్యాణదుర్గం వైపు నుంచి రాయదుర్గం వైపు వెళ్తున్న కారు బైకును ఢీ కొంది. ఘటనలో సుమిత్ర, సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారు ఆపకుండా వెళ్లిపోయాడు. క్షతగాత్రులను కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పదవీకాలం పొడిగింపుపై హర్షం

గుంతకల్లు రూరల్: రాష్ట్రంలోని 55 కులాల కార్పొరేషన్ల పదవీకాలం పొడిగింపుపై కసాపురం బెస్త సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కసాపురంలో శనివారం బెస్త సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులాల వారీగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు తిక్కస్వామి, ఉపాధ్యక్షుడు బెస్త మనోహర్, సుంకన్న, బాలప్ప, రామాంజులు, ప్రధాన కార్యదర్శి మారుతి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మేకపిల్ల మృతి



మృతి చెందిన మేక పిల్ల

గుత్తి: ఈద్గా మైదానం సమీపంలో శనివారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ప్రమాదవశాత్తు మేక పిల్ల పడి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వివరాలు.. ఈద్గా మైదానం సమీపంలో నివాసముండే రఫీ అనే వ్యక్తికి చెందిన మేక పిల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న కంకర కుప్పపై ఎక్కింది. అయితే ప్రమాదవశాత్తు జారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ కు కంచె లేకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు.

26 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో వెలసిన వెంకటరమణస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఈనెల 26 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు వెంకటరమణ స్వామి, ఆంజనేయ స్వామి ఆలయంలో కుంభాభిషేకం, మహా సంప్రోక్షణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. తర్వాత గణపతి పూజ, జప పారాయణం, కలశ స్థాపన, నవగ్రహ వాస్తు, సకల దేవతారాధన, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు. 27న ఉదయం జప పారాయణం, గణపతి, రుద్ర, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమం, 28న శాంతి హోమం, పూర్ణాహుతి, 11 గంటలకు మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

గుత్తి రూరల్: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులును శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌లు రమేష్ బాబు, మజ్జిగ గోపాల్, రామలింగమయ్య, చిదంబరి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అబ్దుల్, వాసు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రోటరీస్కూల్ విద్యార్థి ప్రతిభ



మొదటిస్థానంలో నిలిచిన రాజేష్‌కు బహుమతులు అందజేసిన దృశ్యం

గుంతకల్లు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఈ నెల 20 నుంచి ప్రారంభమైన ఏపీ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంతకల్లు రోటరీ హైస్కూల్‌కు చెందిన టి.రాజేష్ అనే విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. అనంతపురం జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో రాజేష్ అండర్–14 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానం, 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానంలో నిలిచినట్లు టీమ్ మేనేజర్ లాలూ తెలిపారు. శనివారం రాజేష్‌ను చాంపియన్‌షిప్‌తో నిర్వాహకులు మెడల్, ప్రశంసాపత్రాలతో అభినందించారు.

సమన్వయంతో విధులు నిర్వర్తిద్దాం



మాట్లాడుతున్న ఎస్ఐ ఖాజాహుస్సేన్

పెద్దపప్పూరు: అశ్వత్థం తిరునాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సమన్వయంతో విధులు నిర్వర్తిద్దామని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం అశ్వత్థం క్షేత్రంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య,ఆరోగ్య, పోలీసుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. తిరునాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డా.కళ్యాణ్‌కుమార్ తెలిపారు. భక్తులు స్వామిని సజావుగా దర్శించుకునేలా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం చెప్పారు. వాహనాల కోసం ప్రత్యేకం స్థలం కేటాయించామని, భక్తులు అక్కడే వాహనాలు పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందని సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. పెన్నానదిలో పుణ్యస్నానాల కోసం లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ షర్మల తెలిపారు. ఎస్ఐ ఖాజా హుస్సేన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తాడిపత్రి డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తిరునాల ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షించారు. ఏర్పాట్లను పరిశీలించి భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

మధ్యాహ్న భోజనం పునః ప్రారంభం



భోజనాన్ని వడ్డిస్తున్న ప్రిన్సిపల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ నారాయణస్వామి

తాడిపత్రి టౌన్ : స్థానిక ఆటో నగర్ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని శనివారం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ నారాయణస్వామి ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న గ్రామీణ విద్యార్థుల కోసం మూడేళ్లుగా ఎమ్మెల్యే సొంత డబ్బుతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇటీవల పరీక్షల కారణంగా మధ్యాహ్న భోజనానికి అంతరాయం ఏర్పడింది. దీంతోఅధ్యాపకులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని శుక్రవారం రాత్రి కలిసి మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే శనివారం నుంచి కార్యక్రమం అమలుకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారని అధ్యాపకులు తెలిపారు. విద్యార్థులు ఎమ్మెల్యే, ఆయన తనయుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. అధ్యాపకులు సత్యనారాయణ, జయప్రకాష్, ఆలీ, ఎం నారాయణస్వామి, సవిత, ఇందిరా ప్రియదర్శిని, భాస్కర్, జయలక్ష్మి పాల్గొన్నారు.

మద్దతు ధరతో కంది పంట కొనుగోలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ నారాయణనాయక్

యాడికి: రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కంది పంట కొనుగోలు చేయనున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకుడు నారాయణ నాయక్ పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కంది పంట క్వింటాల్‌కు రూ.6,600 మద్దతు ధర ప్రకటించిందన్నారు. త్వరలో కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, వాటిని పంట విక్రయించదలచిన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రబీలో పంట నమోదు పూర్తి చేసి రైతులతో ఈకేవైసీ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్‌బాషా, ఏఈఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

'భూరక్ష'ను సద్వినియోగం చేసుకోండి



దుగుమర్రిలో భూ సర్వేను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ

నార్పల: ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ జగనన్న, భూ హక్కు, భూ రక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. శనివారం దుగుమర్రి, గంగనపల్లిలో నిర్వహిస్తున్న భూ హక్కు,భూ రక్ష సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేకు అందరూ సహకరించాలని ఈఓఆర్డీ కోరారు. పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున, సాయి చరణ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించండి

శింగనమల: అనంతపురం రూరల్ మండలం పాము రాయి నుంచి తాడిపత్రి మండలం బుగ్గ వరకు 544డీ రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం శివపురం, సీ.బండమీదపల్లి, చక్రాయిపేట, పెరవలి, నాయనపల్లిక్రాస్‌లో ప్రజలతో మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతులకు సెంటు రూ.50 వేలు ప్రకారం నష్ట పరిహారం అందించాలన్నారు. దీనిపై ఈనెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నామన్నారు. నాయకులు బాలరంగయ్య, భాస్కర్, శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్ : పాములాయి నుంచి గుంటూరు వరకు నిర్మించనున్న 544 డి హైవే రోడ్డుకు సంబంధించి భూములు, ఇళ్లు నష్టపోతున్న భూముల బాధితులకు ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తాడిపత్రి మండలం రావివెంకటాంపల్లి, భోగసముద్రం, వెంకటరెడ్డి పల్లి, గ్రామాల్లో రైతు సంఘ నాయకులు జీపు జాతా చేపట్టారు.

నేటి నుంచి ఆక్యుప్రెషర్ శిబిరం

పామిడి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 29వ తేదీ ఆదివారం వరకూ ఆక్యుప్రెషర్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. శిబిరంలో రక్తపోటు, మోకాళ్ల నొప్పులు, ఊబకాయం, మూత్రపిండాల వ్యాధి, రాళ్లు, నడుమునొప్పి వంటి వ్యాధులకు రాజస్థాన్ ఆక్యుప్రెషర్ వైద్య నిపుణుడు రవీంద్రకుమార్ చికిత్స అందిస్తారన్నారు. వివరాలకు 6302271972 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న వెంకట్ హరీష్

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని టెస్ట్ మాస్టర్స్ అంతర్జాతీయ ప్రతినిధులు వెంకట్ హరీష్, వంశీ పేర్కొన్నారు. శనివారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో టెస్ట్ మాస్టర్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఐటీ ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రాధాన్యతను వివరించారు. టెస్ట్ మాస్టర్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య కిశోర్, టీపీఓ రంజిత్‌రెడ్డి, డాక్టర్ గురు సిద్ధప్ప, టెస్ట్ మాస్టర్ కన్వీనర్ వహీదా, విద్యార్థులు పాల్గొన్నారు.